ఆగని కబ్జాల పర్వం

- సింగరేణి భూమి చదును
- బోర్డు పాతిన అధికారులు


చదును చేసిన స్థలంలో సింగరేణి అధికారులు పాతిన బోర్డు

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలో భూకబ్జాల పర్వం ఆగడం లేదు. అడ్డుకునే చర్యలు లేకపోవడంతో ఖాళీ భూములపై కన్నేసి కబ్జా చేస్తున్నారు. తాజాగా కెమికల్ ప్రాంతంలో సింగరేణి భూమిని అక్రమార్కులు చదును చేయించారు. ఆదివారం రాత్రి ట్రాక్టర్లతో చదును చేసి స్వాధీనానికి సిద్ధపడ్డారు. సమాచారం అందుకున్న సింగరేణి ఎస్టేట్, ఎస్అండ్‌పీసీ అధికారులు ఘటన స్థలానికి వెళ్లి ఆ భూమి సింగరేణి కంపెనీదని బోర్డు పాతారు. ఇలా రోజుకో ప్రాంతంలో భూ ఆక్రమణలు జరుగుతుండడంతో భవిష్యత్ అవసరాల కోసం ప్రభుత్వ, సింగరేణి భూములు దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. గతంలో కాల్‌టెక్స్ ఏరియా రైల్వేపై ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని చదును చేయగా, బుధాకలాన్ శివారులోని సింగరేణి భూమిని ఆక్రమించారు. ఆయా ప్రాంతాల్లో రెవెన్యూ, సింగరేణి అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి అప్రమత్తం అయ్యారు.

ఖద్దరు మాటున కబ్జాలు..!

భూ ఆక్రమణ వెనుక తాజా ప్రజాప్రతినిధులతోపాటు మరికొందరు మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వీరితోపాటు ఒకరిద్దరు కబ్జాదారుల పేర్లు వినిపిస్తున్నాయి. రాజకీయాల ముసుగులో అనుయాయులను పురమాయించి ఖాళీ భూములు కబ్జా చేయడం పరిపాటిగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. కబ్జా భూములకు నకిలీ పత్రాలు సృష్టించడంలోనూ అక్రమార్కులు పేరొందారు. ఇప్పటికే పలు చోట్ల కబ్జా చేసిన భూములకు బినామీ వ్యక్తుల పేర్లతో పత్రాలు సృష్టించి మోసాలకు పాల్పడడం తంతుగా మారింది. కబ్జా చేసిన భూములను అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

అధికారులు చేతులెత్తేసినట్లేనా..?

భూకబ్జాలకు అంతు లేకుండా పోతున్నా అడ్డుకునే చర్యలకు ప్రభుత్వ అధికారులు సాహసించడం లేదు. భవిష్యత్‌లో మరెవరూ కబ్జాల జోలికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, సింగరేణి అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. భూకబ్జాల వెనుక కొందరు అధికారుల హస్తం, అండదండలు ఉన్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఒకవేళ కొందరు అధికారులు చర్యలకు సిద్ధపడే క్రమంలో కబ్జాదారులు ఓ ముఖ్య ప్రజాప్రతినిధి ద్వారా సదరు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ప్రస్తుత పరిస్థితులు, పరిణామాలను పరిశీలిస్తే అక్రమార్కులపై చర్యలకు అధికారులు చేతులెత్తేసినట్లుగా చెప్పుకుంటున్నారు.

ఘనంగా కలాం జయంతి


కోటపల్లి: నివాళులర్పిస్తున్న ఎస్‌వో, తదితరులు


భీమారం: నివాళులర్పిస్తున్న అశోక్‌యాదవ్

కోటపల్లి/దండేపల్లి/భీమారం/మందమర్రిరూరల్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా వ్యాప్తంగా కలాం చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి ఎన్నో సేవలను అందించారని కొనియాడారు. పలుచోట్ల పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కేకులు కట్ చేశారు. కోటపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో, దండేపల్లి మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో, మందమర్రి పట్టణంలోని మనో వికాస్ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. భీమారం మండలంలో గొర్రెలు, మేకలు పెంపకం దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.


దండేపల్లి: గుడిరేవు పాఠశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయురాలు

క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశం

మంచిర్యాలటౌన్: ఇంటర్మీడియెట్ 2023–24 విద్యా సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు హెటీరో కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పించి, ఉద్యోగం చేస్తూనే ఉచిత డిగ్రీ విద్యను అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆధార్ జిరాక్స్ కాపీ 2, ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్ సర్టిఫికెట్స్, 5 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల 16వ తేదీ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వివేకవర్ధిని డిగ్రీ కాలేజీలో క్యాంప్ ఉంటుందని తెలిపారు. వివరాలకు 9989644088, 6303204295 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుబడిన బియ్యం, నిందితుడితో పోలీసులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, ఎస్సై లచ్చన్న ఆధ్వర్యంలో సిబ్బంది సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ ట్రాలీలో 25క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను అక్రమంగా మహారాష్ట్రకు తీసుకువెళ్తుండగా డ్రైవర్ సిరిగిరి సుధాకర్‌ని అదుపులోకి తీసుకొని బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీసీసీ నస్పూర్ పోలీసులకు అప్పగించారు. బియ్యం విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో సీసీసీ నస్పూర్ ఎస్సై నెల్కి సుగుమాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్‌లో గణితం, రసాయనశాస్త్రం అధ్యాపక పోస్టులకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఖలీల్ తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఇంగ్లిష్‌లో బోధించే, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 17వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాల్సిందిగా కోరారు. సంబంధిత సబ్జెక్టులో ఎంఎస్సీ, బీఎడ్ చేసిన వారు అర్హులని తెలిపారు.

ఘనంగా కూచిపూడి దినోత్సవం


కూచిపూడి నేర్పిస్తున్న మాస్టర్లతో విద్యార్థులు

జన్నారం: మండల కేంద్రంలోని స్లేట్ హైస్కూల్‌లో మంగళవారం కూచిపూడి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలకు చెందిన 400మంది విద్యార్థులు, ఇద్దరు మాస్టర్లు కలిసి కూచిపూడి నృత్యం చేశారు. నృత్య కళాకారులను తయారు చేయడానికి పాఠశాలలో కూచిపూడి నేర్పిస్తున్నట్లు స్లేట్ విద్యాసంస్థల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ రజిత, ప్రిన్సిపాల్ షరీఫ్ ఖాన్, డ్యాన్స్ మాస్టర్లు నర్మదగౌడ్, సుధ తదితరులు పాల్గొన్నారు.

17న వాల్మీకి జయంతి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఈ నెల 17న ఉదయం 10గంటలకు మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలు విజయవంతం చేయాలని కోరారు.

గంగారాంలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న, మెడికల్ ఆఫీసర్

నెన్నెల: మండలంలోని గంగారాం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్ మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఇటీవల జ్వరాలు ప్రబలుతున్నందునా రక్తనమూనాలు సేకరించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్యరాణి, ఏఎన్ఎం బుచ్చమ్మ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి రాజ్‌కుమార్, నాయకులు శ్రీరాముల దేవేందర్, కస్తూరి పోచన్న, కొత్తూర్ కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జలీల్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు తథ్యం

- జిల్లా అధ్యక్షుడు రఘునాథ్


దండేపల్లిలో సభ్యత్వం ఇస్తున్న రఘునాథ్

దండేపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన బీజేపీ గెలుపు తథ్యం అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ధీమా వ్యక్తం చేశారు. దండేపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని కొర్విచెల్మలో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు గాదె శ్రీనివాస్, కర్ణాల కిషన్, గుండా ప్రభాకర్, బత్తుల శేఖర్, బోడకుంటి వెంకటేష్, దుమ్మని సత్తన్న, ముత్తె అనిల్, రమేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మండలంలోని దౌడపల్లి, కొమ్ముగూడెం గ్రామాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మాట్లాడారు. పలువురితో సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో మండల నాయకులు కిషన్, క్రిష్ణమూర్తి, ప్రభాకర్, సతీష్, వేణుగోపాల్, రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పర్వతాన్ని అధిరోహించిన మంచిర్యాల విద్యార్థి


పర్వతంపై విద్యార్థి విహాన్‌రామ్

మంచిర్యాలఅర్బన్: హిమాచల్ ప్రదేశ్‌లోని మౌంట్ పతాల్స్ పర్వతాన్ని మంచిర్యాల నారాయణ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థి జాటోత్ విహాన్‌రామ్ అధిరోహించారు. ఈ నెల 7న హిమాచల్‌ప్రదేశ్ మనాలిలోని 14600ఫీట్స్(4250 మీటర్లు) ఎత్తు కలిగిన మౌంట్ పతాల్స్ పర్వతాన్ని 14గంటల సమయంలోనే అధిరోహించాడు. చిన్న వయస్సులోనే (ఎనిమిది సంవత్సరాల వయస్సు)ఇంటర్నేషనల్ మౌంటనేర్ జీనస్ వరల్డ్ రికార్డు హోల్డర్ సారథ్యంలో ఈ ఘనత సాధించాడు. విద్యార్థిని మంగళవారం నారాయణ పాఠశాల జీఎం గోపాల్‌రెడ్డి, కరీంనగర్ జోనల్ ఏజీఎం చైతన్యరావు, పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, కో–ఆర్డినేటర్లు శ్రావణి, రవళి అభినందించారు.

ఐటీడీఏ డీఈపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న కాంట్రాక్టర్లు

దండేపల్లి: ఐటీడీఏ దండేపల్లి సబ్‌డివిజన్ డీఈపై చర్యలు తీసుకోవాలని పలువురు కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. దండేపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కాంట్రాక్టర్లు జైనోద్దీన్, ఇమామొద్దీన్, సాధిక్, రామస్వామి మాట్లాడారు. ఐటీడీఏ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఐటీడీఏ నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు, ఎంబీ రికార్డులు, బిల్లుల మంజూరు తదితర అవసరాల నిమిత్తం దండేపల్లి సబ్‌డివిజన్ కార్యాలయానికి వస్తే, డీఈ అందుబాటులో ఉండటం లేదన్నారు. ఫోన్ చేస్తే ఒక్కోసారి స్పందించరు.. స్పందిస్తే నిర్మల్‌కు రావాలని చెబుతున్నారని ఆరోపించారు. పనులు కావాలంటే 5శాతం పర్సెంటేజీ ఇవ్వాల్సిందేనని, లేకుంటే ఫోన్ స్విచ్ఆఫ్ పెడతారని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లను ఇబ్బంది పెడుతున్న డీఈపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై డీఈ షహాబాద్‌అహమ్మద్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా సరైన వసతులు లేకపోవడంతో స్థానికంగా ఉండటం లేదు. బిల్ చేసేందుకు అవసరమయ్యే స్టేషనరీ ఖర్చుల కోసం మాత్రమే డబ్బులు అడిగాను. సిబ్బంది కొరత కారణంగా సైటుకు వెళ్లడం లేదు. ఇప్పటికే పలువురు కాంట్రాక్టర్లు నాపై ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేశారు. దానికి నేను వివరణ ఇచ్చుకున్నానని చెప్పారు.

ఏడీఈ, ఏఈలకు వీడ్కోలు

చెన్నూర్: చెన్నూర్ ఆపరేషన్ సబ్ డివిజన్‌లో విధులు నిర్వర్తించిన ఏడీఈ రవికుమార్ బెల్లంపల్లి రూరల్ సబ్ డివిజన్‌కు బదిలీ కాగా, అస్నాద్ ఏఈ బాస్కర్ బెల్లంపల్లికి, సబ్ ఇంజినీర్ సుస్మిత మంచిర్యాలకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు, కాంగ్రెస్ నాయకులు హిమవంతరెడ్డిలతో పాటు ఏఈ శ్రీనివాస్, విద్యుత్ ఉద్యోగులు వీడ్కోలు పలికారు. చెన్నూర్ సబ్ డివిజన్‌లో మూడున్నరేళ్ల పాటు ప్రజలకు సేవలందించిన రవికుమార్, బాస్కర్, సుస్మితలు బెల్లంపల్లి రూరల్ సబ్ డివిజన్‌లో మెరుగైన సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

బెల్లంపల్లి: ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపక నేత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ వర్ధంతిని పురస్కరించుకొని నిర్వహించే సదస్సు కరపత్రాలను ఆ పార్టీ నాయకులు బెల్లంపల్లిలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 17న ఓంకార్ వర్ధంతిని వరంగల్ జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యుడు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ


రమేశ్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌గా పాఠశాల బోటనీ లెక్చరర్ రమేశ్‌ను నియమిస్తూ మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

సమస్యల పరిష్కారానికి కృషి

- ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్ రావు


కార్మికులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్టీయూసీ కృషి చేస్తుందని ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. ఆర్కే 5, ఆర్కే 6, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనులను మంగళవారం ఆయన సందర్శించారు. కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు భీమ్ రావు, కేంద్ర కార్యదర్శి గరిగే స్వామి, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జి తిరుపతి రాజు, ఏరియా కార్యదర్శి వెంకటస్వామి నాయకులు జాన్సన్, జగన్‌మోహన్, వీర ప్రతాప్, మారుతి, రమేశ్, రంగిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి


మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: రక్షణ చర్యలు పాటిస్తూ ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఏరియా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు, ప్రతీ ఉద్యోగి, అధికారి ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. యంత్రాలను 100శాతం వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ప్రాజెక్టు అధికారులు శ్రీనివాస్, ఏవీ రెడ్డి, అధికారులు మురళీధర్, చంద్రశేఖర్‌రెడ్డి, అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ చేస్తున్న అధికారులు

బెల్లంపల్లి: విధులకు గైర్హాజరవుతున్న పలువురు సింగరేణి కార్మికులకు మందమర్రి ఏరియా శాంతిఖని అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. గని అధికారి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించారు. కంపెనీ నిబంధనల ప్రకారం ప్రతి నెల 16మస్టర్ల కన్నా తక్కువ మస్టర్లు ఉన్న కార్మికులను కౌన్సెలింగ్‌కు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో కార్మికుడిని, కుటుంబ సభ్యులను పిలిచి గైర్హాజరుకు గల కారణాలు ఏంటని అడిగి తెలుసుకున్నారు. విధులకు హాజరు కాకపోవడం వల్ల ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉంటుందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగ ఆవశ్యకతను కార్మికుడు, కుటుంబ సభ్యులకు అధికారులు వివరించారు. భవిష్యత్‌లో గైర్హాజరు కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కౌన్సెలింగ్ గని సంక్షేమ అధికారి సత్యనారాయణ, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ దాసరి తిరుపతి గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి


టైలరింగ్ కోర్సు ప్రారంభిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణి అందిస్తున్న వృత్తి శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 2024–25కు గాను పలు వృత్తి శిక్షణ కోర్సులను మంగళవారం ప్రగతి మైదానంలో ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి చేతుల మీదుగా ప్రారంభించారు. టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ టీడీపీ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాధాకుమారి మాట్లాడుతూ.. మహిళలు ఈ శిక్షణతో మెళుకువలు నేర్చుకోవాలన్నారు. ఇప్పటికే వేలాది మంది మహిళలకు పలు వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీఓ కాంతారావు, సేవా సెక్రెటరీ కొట్టె జ్యోతి, శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో ఊరు మందమర్రి వెళ్లే మార్గంలో ఉన్నటువంటి ఊర చెరువు శిఖం హద్దుల ఏర్పాటు కోసం గత నెలలో ప్రారంభమైన సర్వే పనులు మంగళవారం పునఃప్రారంభించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ నుంచి సర్వే ల్యాండ్ రికార్డ్ ఏడీ శ్రీనివాస్ సిబ్బందితో హాజరై చెరువు చుట్టూ పరిసరాలను తిరిగి చెరువు శిఖం హద్దులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. ఊర చెరువు శిఖం హద్దుల గుర్తింపు పూర్తి కాగానే జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్లు తెలిపారు.

27న దండారి దర్బార్


సమావేశమైన ఆదివాసీ దండారి నిర్వాహకులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ సల్పాలవాగు అటవీప్రాంతంలో ఈ నెల 27న నిర్వహించే దండారి దర్బార్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. సల్పాలవాగు వెంకటాద్రి ఆలయం వద్ద మంగళవారం దండారి నిర్వాహకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏటా నిర్వహించే దండారి దర్బార్ కార్యక్రమం 26న సాయంత్రం దండారీలు సల్పాలవాగు చేరుకొని, 27న కార్యక్రమం నిర్వహించాల్సిందిగా తీర్మానం చేశారు. అనంతరం నిర్వహణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆడ జంగు, గౌరవాధ్యక్షుడిగా రాయిసిడాం రాందాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, ప్రధాన కార్యదర్శిగా సోయం సూరు, కోశాధికారిగా మడావి వెంకటేష్, ఉపాధ్యక్షులుగా ఆడ జంగు, మడావి గోపాల్, టేకం రామకృష్ణ, రాయిసిడాం సోము, ప్రచార కార్యదర్శులుగా ఆత్రం జంగు, టేకం భగవంతరావు, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

17 నుంచి సప్తాహం

చెన్నూర్: పట్టణంలోని బాలాజీ గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఈ నెల 17 నుంచి 23వరకు లోక కళ్యాణార్థం బుర్ర భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో శ్రీ మద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పడమటింటి మహేశ్ తెలిపారు. 17న ఉదయం పట్టణంలో 9:30గంటలకు శోభాయాత్ర, 10:30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రవచనాలు, 12:30 గంటలకు భక్తులకు అల్పాహారం, సాయంత్రం 6 గంటల వరకు ప్రవచనాల అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న ఉదయం 11గంటలకు రుక్మిణీ కల్యాణం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రూ.10నాణేలపై అవగాహన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రూ.10నాణెం మార్కెట్లో చెల్లుబాటు అవుతుందని ఆర్బీఐ అధికారికంగా ప్రకటించిందని యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సతీశ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యాపార దుకాణాలను మంగళవారం సందర్శించి వ్యాపారులకు రూ.10నాణేల చెల్లుబాటుపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించారు. ఆర్బీఐ ఆదేశాల మేరకు రూ.10నాణేలు చట్టబద్ధమైనవని, నాణేలు అన్ని ఆర్థిక కార్యకలాపాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. రూ.10నాణేలు చెల్లవనే తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని గుర్తు చేశారు. మార్కెట్లో రూ.10 కొరత ఉందని తెలియజెప్పి, రూ.లక్ష విలువ చేసే రూ.10నాణేలను వ్యాపారులకు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ హాజీపూర్ బ్రాంచ్ సబ్ మేనేజర్ శ్రీకాంత్, క్యాషియర్ రమేశ్, బ్యాంకు అధికారులు మనోహర్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.